క్లుప్తంగా

నేడు దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: తొస్సిపూడి గ్రామంలోని కాలువ రేవు వద్ద కొలువైన కనకదుర్గమ్మ ఆలయ 33వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. దాతల సహకారంతో మధ్యాహ్నం 11 నుంచి అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారి సంబరం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు.

సత్యసాయి బోధనలు అనుసరణీయం



భక్తులకు సాయిబాబా చిత్రపటాలు అందజేస్తున్న నిర్వాహకుడు

రంగంపేట: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలలో భాగస్వాములు కావాలని సబ్ జోన్ కన్వీనర్ మల్రెడ్డి వీర్రాజు అన్నారు. రంగంపేటలోని సత్యసాయి సమాజ సేవా కేంద్రం వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన వీర్రాజు మాట్లాడుతూ సత్యసాయి బోధనలు ఆచరణీయమన్నారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, ఉదయం బాబా పాదుకలకు అష్టోత్తరపూజ, సత్యసాయి వ్రతం, భజన చేశారు. కార్యక్రమాల్లో జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు, సేవాదళ్ సభ్యులు నేతి సత్యనారాయణ, వెంకట రమణ, సాయి కిరణ్, నిఖిల, అరుణ, సత్యం పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మగ్గం వర్క్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

రంగంపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా కృషి చేయాలని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు కోరారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడిశలేరులో నిర్వహించిన మగ్గం వర్క్ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం దివాన్ చెరువులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారందరూ వర్క్‌ను కొనసాగిస్తూ ఆర్థికంగా లాభపడాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని, దీనితో సమాజానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సుంకర నాగేశ్వరరావు, ప్రదీప్, వినీల, శిక్షకురాలు జంగలి కుమారి పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమావేశం



ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమైన అధికారులు

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ వీరభద్రుని ఆలయానికి వెళ్లే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై శుక్రవారం సమావేశం జరిగింది. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులతో వంగలపూడి రేవు వద్ద తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.భారతి, ఎస్సై డి.రామ్ కుమార్ మాట్లాడారు. రేవు వద్ద ఏర్పాటు చేయనున్న వైద్యశిబిరాలు, తాగునీరు, మరుగుదొడ్లు, గోదావరి పాయ వద్ద బారికేట్లు, పోలీస్ బందోబస్తు, విద్యుత్ సరఫరా, లైట్లు తదితర వాటిపై ఆరా తీశారు. వీటని ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలని ఉత్సవ కమిటీకి సూచించారు.

ఉత్సాహంగా ఉద్భవ్ వేడుకలు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ యువజన ఉత్సవాలు రెండోరోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, సుడోకు, పోస్టర్ మేకింగ్ మ్యూజిక్, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. శనివారం ముగింపు వేడుకలు జరగనున్నాయి.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 3వ తేదీన ఢిల్లీలోని పార్లమెంట్ ముందు నిరసన తెలుపుతామని బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు సంఘ నాయకులు పాపారావు, శ్రీనివాస్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఇన్నీసుపేటలోని స్టేట్ బ్యాంక్ వద్ద ధర్నా చేశారు. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు.

ఈ-క్రాప్‌తో రైతులు సేఫ్

- పంటల నమోదుతో అనేక ప్రయోజనాలు
- రైతులందరూ వినియోగించుకోవాలి
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



నామవరంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు, వ్యవసాయాధికారులు

రాజానగరం: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు ఈ-క్రాప్‌తో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. సాగు చేసిన పంట వివరాలను ఆన్‌లైన్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అమలు చేసే పథకాలను సకాలంలో అందుకోవడానికి అవకాశం ఉంటుంది. నారు నుంచి పంట దిగుబడులను విక్రయించే వరకూ అన్ని రకాల సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టపరిహారాన్ని పొందడానికి చాలా కీలకం. రబీ వరి పంట కోతలు మరో నెల రోజులలో ప్రారంభయ్యే సమయంలో కూడా ఇంత వరకూ ఈ-క్రాప్ చేయించుకోని రైతులకు మరో అవకాశం కల్పించారు. ఈ విషయంపై వ్యవసాయాధికారులు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, రైతులను చైతన్యపరుస్తునారు. దీనితో పాటు ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలని సూచిస్తున్నారు.

65,655 ఎకరాలలో సాగు

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో 65,655 ఎకరాలలో పంటలను సాగు చేస్తున్నారు. అయితే వీటిలోని 58,985 ఎకరాల పంటను మాత్రమే ఇప్పటి వరకూ ఈ-క్రాప్ చేశారు. మిగిలిన ఎకరాల్లో పంటను సత్వరమే ఆన్‌లైన్ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా పొలంబడి కార్యక్రమం ద్వారా గ్రామాలకు వెళ్లి, వరి క్షేత్రాలను పరిశీలించడంతో పాటు రైతులకు ఈ -క్రాపింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 25లోగా పూర్తి కావాల్సి ఉంది.

చాలా సులభం

రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ-క్రాపింగ్ ప్రక్రియను చాలా సులభంగా చేసుకోవచ్చు. సాగు చేస్తున్న భూమికి సంబంధించిన సర్వే నంబరు, పట్టాదారు పాస్ పుస్తకం, సాగు చేస్తున్న పంట వివరాలు, విస్తీర్ణం తదితర వివరాలను రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి తెలియజేయాలి. ఇప్పటికే కొన్నిచోట్ల గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు తమ పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి, రైతులను కలుసుకుని ఈ-క్రాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



ఈ-క్రాప్ నమోదుతో రైతులకు చాలా ఉపయోగం కలుగుతుంది. ఏ పంట, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఏ మేరకు దిగుబడులు వస్తాయో కచ్చితంగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వం నుంచి నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో పొందడానికి ఉపయోగపడుతుంది.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

నమోదు తప్పనిసరి



సాగుచేసే రైతులందరూ ఈ-క్రాప్ తప్పక చేయించుకోవాలి. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అమలు చేసే వివిధ పథకాలను రైతులు పొందడానికి అవకాశం ఉంటుంది. ఇంతవరకు ఈ-క్రాప్ చేయించుకోని రైతులుంటే సత్వరమే సమీపంలోని రైతు సేవాకేంద్రానికి వెళ్లాలి. అక్కడి సిబ్బంది సహకారంతో నమోదు చేయించుకోవాలి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేత



పందలపాక హైస్కూల్లో విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న విద్యా కమిటీ సభ్యులు

సాక్షి ఇంపాక్ట్

బిక్కవోలు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సమయాల్లో అల్పాహారం అందించకపోవడంతో విద్యార్థులు నీరసించి పోతున్నారు. దీనిపై శుక్రవారం సాక్షి పత్రికలో అల్పాహారం...అదేకష్టం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి పందలపాక ఉన్నత పాఠశాల విద్యా కమిటీ స్పందించింది. అదనపు తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు రోజూ ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా శుక్రవారం స్నాక్స్ పంపిణీ చేశారు.

అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు



సంపరలో ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ



వడిశలేరులో కొలువైన విజయ దుర్గాంబిక

పెదపూడి: సంపరలోని విజయదుర్గమ్మకు శుక్రవారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్ర నామ పారాయణ చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కరకుదురులో అన్నసమారాధన

కరకుదురు గ్రామంలోని దుర్గాదేవి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం నుంచి అమ్మవారు నిత్యం భక్తులతో పూజలందుకుంటున్నారన్నారు. ఈ ఆలయం వద్ద ప్రతి శుక్రవారం అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.

విజయ దుర్గాంబికకు పూజలు

రంగంపేట: గ్రామంలోని తాగునీటి చెరువు వద్ద ఉన్న విజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు నారాయణ శర్మ తెల్లవారుజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే చంద్రేడు, వడిశలేరు గ్రామాల్లో కొలువైన శ్రీదేవి కనకదుర్గ, విజయ దుర్గాదేవి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం



పెద్దాడలో ప్రతిజ్ఞ చేస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి తదితరులు

పెదపూడి: సంపద తయారీ కేంద్రాలతో సచివాలయాలకు అదనపు ఆదాయం లభిస్తుందని కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణి అన్నారు. పెద్దాడలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. పొడి చెత్తను రీసైకిల్‌కు విక్రయించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలను మరింత మెరుగుపర్చి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేయాలన్నారు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన, క్లోరినేషన్ నీరు సరఫరా చేయాలన్నారు. అలాగే ఈ కేంద్రం నిర్వహణపై క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు డి.ఉష, మన్యం శ్రీనివాస్ చౌదరి, సిబ్బంది అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో లక్ష మంది విద్యార్థులకు ఫెలోషిప్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాదరాజు

రాజానగరం: ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఒక లక్ష ఫెలోషిప్‌లను వివిధ పరిశ్రమలలో కల్పించనున్నారని విశ్రాంత శాస్త్రవేత్త దండు రాధా ప్రసాదరాజు తెలిపారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో 'సామర్థ్య నిర్వహణ – చొరవలు' అనే అంశంపై శుక్రవారం నిపుణులతో చర్చాగోష్ఠి జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌గా పాల్గొన్న డాక్టర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ఫెలోషిప్‌ల కోసం ఏ సంస్థలకు, ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అలాగే పరిశోధనలకు కూడా ప్రభుత్వం ఎంతగానో ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇందుకోసం ఈ ఏడాది రూ. 11,200 కోట్లు కేటాయించారన్నారు. వివిధ పరిశోధన పథకాలు, వాటికి దరఖాస్తు చేసుకోవడం, అర్హతలు, ఆయా పథకాలకు విడుదలయ్యే నిధుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సీఏఓ కేవీబీ రాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ టీవీ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎం ఎస్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామాల సాధనకు కృషి



ఎస్టీ రాజాపురంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర తదితరులు

- జిల్లా అదనపు వైద్యాధికారి వసుంధర
- ఎస్టీరాజాపురంలో టీబీ వెరిఫికేషన్ బృందం పర్యటన

రంగంపేట: టీబీ రహిత గ్రామాలే లక్ష్యంగా పని చేస్తున్నట్టు జిల్లా అదనపు వైద్యాధికారి, జిల్లా క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ అధికారి ఎస్.వసుంధర అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎస్టీ రాజాపురం గ్రామంలో శుక్రవారం జిల్లా టీబీ వెరిఫికేషన్ టీమ్ పర్యటించింది. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ మండలంలోని చంద్రేడు, ఎస్టీ రాజాపురం టీబీ రహిత గ్రామాలుగా ఉన్నాయని, ఈ రెండూ సిల్వర్ మెడల్స్‌కు ఎంపిక అయ్యాయన్నారు. ఈ రెండు గ్రామాలు 2023లో బ్రాంజ్ మెడల్స్ సాధించగా, 2024లో సిల్వర్ మెడల్స్‌కు ఎంపిక అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో 2024లో నమోదు చేసిన టీబీ నిర్ధారణ పరీక్షలు, టీబీ రోగుల వివరాలు, నిక్షయ పోషణ యోజన, పోషకాహార కిట్లు, 2023లో అవుట్‌కమ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర, డీఎస్ఎంఓ డాక్టర్ హారిక, రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.వేణు శ్రీలక్ష్మి, కె.చిన్నారావు, పంచాయితీ కార్యదర్శి ఎస్.దినేష్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

23న విజయవాడలో విలీన సభ

మధురపూడి: సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీకి చెందిన రెండు గ్రూపుల విలీన సభ ఈ నెల 23వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నాయకులు పి.ప్రదీప్, మరుకుర్తి ఏసు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. కొంత కాలంగా విడిపోయిన ఈ పార్టీలు విలీనమవుతున్నాయన్నారు. పాసిస్టు కూటమి ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా, రైతాంగ ఉద్యమాలు నిర్వహించేందుకు విప్లవ పార్టీలన్నీ ఐక్యం కావాలన్నారు. ప్రజా పోరాటాల తోనే హక్కుల సాధన సాధ్యమవుతుందన్నారు.

వెండి సామగ్రి చోరీ

బిక్కవోలు: ఇంటికి వేసిన తాళాన్ని పగలకొట్టి కిలో వెండి సామగ్రిని దొంగలు చోరీ చేశారు. ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పందలపాక గ్రామానికి చెందిన లాల్‌బహదూర్ రెడ్డి కుటుంబంతో ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. దొంగలు గురువారం రాత్రి ఆ ఇంట్లోకి చొరబడి సుమారు కిలో వెండి పూజా సామగ్రిని దోచుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



పోటీలను తిలకిస్తున్న గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు

ప్రకాశం నగర్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక చెరుకూరి కన్వెన్షన్ హాలులో ఏపీ స్టేట్ వుమెన్స్ ఊషూ లీగ్ పోటీలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాశరావుతో కలిసి ఆయన తిలకించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీల్లో పలువురు క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకుడు అజ్జరపు వాసును అభినందించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయ పోటీల్లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అజ్జరపు వాసు మాట్లాడుతూ ఈ పోటీలకు 250 మంది క్రీడాకారులకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముత్యాల రావు, నరసింహారావు, సుందర్ రావు, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ పాల్గొన్నారు.

రిఫ్రిజిరేటర్, ఏసీ సర్వీసింగ్‌లో శిక్షణ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 24 నుంచి రిఫ్రిజిరేటర్, ఏసీ రిపేర్ సర్వీసింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని ఆ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు ఉండాలన్నారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలవారు 0883–242024, 2428807, 97013 59954, 90143 28803 నంబర్లను సంప్రదించాలన్నారు.

మాతృభాషా పరిరక్షణ సమష్టి బాధ్యత

- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



నండూరి జయలక్ష్మిని సత్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



జి.మామిడాడలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రాజారెడ్డి తదితరులు



సీతానగరం డిగ్రీ కళాశాలలో విశ్రాంత అధ్యాపకురాలికి సన్మానం



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థుల వేషధారణ

రాజానగరం: అమ్మ వంటి మాతృ భాషను పరిరక్షించుకునే బాధ్యత అందరిపైనా ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మపై చూపించే ప్రేమాభిమానాలను మాతృభాషపైనా చూపించినప్పుడే భావితరాలకు పదిలంగా అందించగలమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ మాతృ బాషా దివస్ పేరుతో యూనివర్సిటీలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న నండూరి జయలక్ష్మి మాట్లాడుతూ ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా నండూరి కృష్ణమాచార్యులు భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ ఎస్.సజనారాజ్, డాక్టర్ దొంతరాజు లక్ష్మీనరసమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

జి.మామిడాడలో..

పెదపూడి: భాష, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్నారని లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడ జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బి.ఛత్రపతి శివాజీ, పప్పు రామకృష్ణారెడ్డి, ఎస్.కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.వెంకటరెడ్డి, తిర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యునెస్కో ప్రతిపాదించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం అంటే ప్రపంచంలోని అన్ని భాషలకు పుట్టిన రోజు అన్నారు. ఆంగ్ల విభాగాధిపతి వీవీ సుబ్బారావు, విశ్రాంత లెక్చరర్ సుహాసిని, వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ మాట్లాడారు.

- సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో తెలుగు భాషోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం.వీరభద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింహాద్రి రావు, డాక్టర్ సూర్య శంకర్, పార్వతి పాల్గొన్నారు. మాతృభాషపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది.

ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించి, ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలవాలని ఆర్టీసీ ఈడీ చంగల్ రెడ్డి పిలుపు నిచ్చారు. విజయవాడ జోన్ ఈడీ విజయరత్నంతో కలిసి ఆయన శుక్రవారం రాజమహేంద్రవరం బస్ స్టేషన్, గ్యారేజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గేట్ మీటింగ్ నిర్వహించి సిబ్బందితో మాట్లాడారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్బుం పాల్గొన్నారు.

320 మందికి వైద్యసేవలు



శిబిరంలో ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ బాపూజీ నగర్ గంగిరెద్దుల కాలనీలో సత్యచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. కేఎస్ఆర్ హాస్పిటల్స్ అధినేత కొమ్మా శ్రీనివాసరావు ఎముకల సాంద్రత పరీక్షలు, బుద్ధుడు హాస్పిటల్స్ వైద్యురాలు శ్వేతా సజ్జల కంటి పరీక్షలు చేశారు.